# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 131 VEKUVA SAMAYAM TELUGU DAILY

⋆ Mahabubnagar ⋆ Hyderabad ⋆ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: మంగళవారం 02 జూన్ 2026




7వ పేజీలో...

**సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు**



# సంపాదకీయం

## సనాతన ధర్మం, చరిత్ర ఒకటేనా?

బండి నారాయణస్వామి వంటి రచయితలు సనాతన ధర్మాన్ని ఒక భౌతిక 'చరిత్ర'గా కుదించి ('మతాలన్నీ సనాతనం వైపే!'-24-5-2026) చూసే ప్రయత్నం చేస్తున్నారు. తాత్త్వికంగా చరిత్ర అనేది స్థల కాల బద్ధమైనది. కానీ 'సనాతనం' అంటేనే స్థల కాలాలకు అతీతమైన అనంత సత్యం. బుద్ధుడి కాలం నుంచి ఆధునిక తాత్త్వికుల వరకు ఎవరూ సనాతన ధర్మాన్ని భౌతిక చరిత్రతో లంకె పెట్టలేదు. నేటి 'చరిత్ర' అనే భావన ఐరోపా వలసవాద దృక్పథం నుంచి దిగుమతి అయినది. ఏసుక్రీస్తును చారిత్రక పురుషుడిగా రెండు వేల ఏళ్ల క్రితం నాటి పాలస్తీనాకు పరిమితం చేయడం సాధ్యం. కానీ, మన పురాణపురుషుడైన శ్రీరాముడి స్థల కాలాలను ఇటువంటి కొలమానాలతో నిరూపించడం అసాధ్యం. పాశ్చాత్య చారిత్రక కాలం అనేది ఒక బాణంలా సరళరేఖలో ముందుకు సాగుతుంది. భారతీయ భావనలో కాలం చక్రాకృతిలో భ్రమిస్తుంది. కాలం అనంతం కావడం వల్ల, పురాణాల ప్రకారం రాముడు ఒక్కసారే అవతరించడు. ఆ దివ్యలీల విశ్వ కాలచక్రంలో నిరంతరం పునరావృతమవుతూనే ఉంటుంది. అబ్రహామిక్ మతాలలా సనాతన ధర్మానికి ఏకైక పుణ్యస్థలం, ఒకే గ్రంథం, అంతిమ ప్రవక్త గానీ లేరు. సనాతన ధర్మం ఏ ఇతర జీవన విధానాన్ని నేలమట్టం చేయాలని చూడదు, బానిసగా మార్చుకోదు. దీనికి వెలుపల 'ఇతరములు' అని విడిగా గుర్తించడమే తాత్త్వికంగా కుదరదు.

నారాయణస్వామి ఒకవైపు వర్ణ ధర్మాన్ని తిరస్కరిస్తారు. మరొకవైపు జాతి, డీఎన్ఏ, రక్తం వంటి పదాల్ని రేసిస్ట్ పదాల్ని వాడతారు. కుల వివక్ష కన్నా రేసిజం గొప్పదా? కుల నిర్మూలనవాదులు అని చెప్పుకున్న వారిలో సాధారణంగా కనబడే ముస్లిం వ్యతిరేకత ఈయనలోనూ కనపడుతుంది. పాకిస్తాన్‌కు వచ్చిన ప్రమాదం అరబ్బులనో, టర్కీనో ఆశ్రయించటం వల్ల కాదు ముస్లిం జాతీయవాదం వల్ల వచ్చింది. అలాగే భారతదేశానికి వస్తున్న ప్రమాదం కూడా హిందూత్వ జాతీయవాదం వల్లనే. ఆ హిందూ మతం పూర్తిగా కొత్తది అదొక ప్రచ్ఛన్న క్రైస్తవం. అది సనాతన ధర్మం కాదు. అరబ్బులు పోర్చుగీసుల దాడులతోనే ఇస్లాం, క్రైస్తవాలు భారతదేశంలోకి ప్రవేశించాయి అనే వాదన పూర్తిగా హిందూత్వ ఫాసిజానికి దగ్గరగా ఉంది. మొట్టమొదట కేరళలో ఇస్లాం అరబ్బులతో వ్యాపార సంబంధాల వల్ల ప్రవక్త జీవించి ఉన్న ఏడవ శతాబ్దంలోనే ప్రవేశించింది. యుద్ధం ద్వారా కాదు. భారతదేశంలోకి క్రైస్తవ మతం క్రీస్తు శకం 1వ శతాబ్దంలోనే ప్రవేశించింది. ఏసుక్రీస్తు పన్నెండు మంది ముఖ్య శిష్యులలో ఒకరైన సెయింట్ థామస్ ద్వారా ఈ మతం భారత గడ్డ పైకి వచ్చింది. అప్పటికి యూరప్‌లోకి క్రైస్తవం వెళ్ళనే లేదు. ప్రతిదాన్ని ఘర్షణాత్మకంగా చూడడం హిందూత్వ ఫాసిజంలో భాగం. బ్రిటిష్ కాలానికి చెందిన శృంగేరి శారదా పీఠాధిపతులు జగద్గురు శ్రీ చంద్రశేఖర భారతీ స్వామి వారి ప్రకారం సనాతన ధర్మం రెండు విధాలు: ఒకటి- 'సామాన్యం', రెండు- 'విశేషం'. సామాన్య దృక్పథంలో చూస్తే క్రైస్తవం, ఇస్లాం కూడా సనాతన ధర్మ స్వరూపాలే; వాటి ఆచారాలు, గ్రంథాలు వాటి విశేష గుణాలు మాత్రమే. అందుకే, వైదిక ధర్మంలోకి ఘర్ వాపసీ కోరుకొన్న ఒక క్రైస్తవుడిని స్వామి నిరాకరిస్తూ, భగవదిచ్ఛ ప్రకారమే ఆ మతంలో జన్మించావు కాబట్టి, అందులోనే సచ్ఛీలుడిగా జీవించమని ప్రబోధించారు. దీన్ని విస్మరించి, హిందూమతం అన్నిటికన్నా ప్రాచీనమైనది, మిగిలినవి కురుచ మతాలు అని చరిత్ర ఆధారంగా నిరూపించాలనుకోవడం ప్రచ్ఛన్న క్రైస్తవమే. 'స్వదేశీ--విదేశీ మతాలు' అనే పదాలు వాడటంలోనే అసలు సనాతనతత్వం మిస్ అయింది. మతాల స్థల కాలాలు, కొత్త పాతలు వెతకడం సనాతనం కాదు. అలాగే ఒక మతం కన్నా మరొక మతం గొప్పది తక్కువది అనే భావాన్ని రామకృష్ణ పరమహంస తిరస్కరించారు. అన్నీ ఒకే సత్యం యొక్క బహుళ వ్యక్తీకరణలు అనే ఆయన భావించారు. అసలు 'మతం', 'హిందూ' అనే కాన్సెప్ట్‌లే బ్రిటిష్ కాలంలో వచ్చిన ఆధునిక భావనలు. అవి సనాతనాలు కావు. నారాయణస్వామి చారిత్రక ప్రమాణం ప్రకారం చూసినా, హిందూ మతం ప్రాచీనం అని కానీ, పూర్తి స్వదేశీ అని కానీ గొప్పలు చెప్పడం కుదరదు. అందరూ వలస వచ్చినవారే. స్వామి నేటి హిందూవాదుల చరిత్రను ప్రమాణంగా తీసుకొంటున్నారు అనుకుంటా. అలాగే భారతీయ ఇస్లాం, క్రైస్తవాలు స్థానిక లక్షణాలు సంతరించుకున్నాయి. ఉదాహరణ దర్గా సంస్కృతి. సూఫీయిజం, షిరిడి సాయిబాబా పూజా విధానం, అలాగే వేంకటేశ్వర స్వామి-బీబీ నాంచారి కథ... ఒక ఉమ్మడి సంస్కృతిని మనకి పరిచయం చేస్తాయి. సూఫీయిజం భారతీయ సర్వాంతర్యామి దృక్పథానికి అద్వైతానికి చాలా దగ్గర. వీటిగురించి స్వామి అసలు మాట్లాడరు. ఈ చారిత్రక ఏకీకరణ దృక్పథం సావర్కర్ ప్రతిపాదించిన రాజకీయ హిందుత్వ సిద్ధాంతానికి సమీపంగా ఉంటుంది. అందుకే ఆ కాలంలోనే సనాతన ధర్మ సంరక్షకులైన స్వామి కరపాత్రి... సావర్కర్ రాజకీయాన్ని, సావిత్రీదేవి (మాక్సిమిలియాని పోర్టాస్) వంటి వారు హిట్లర్‌ను విష్ణుమూర్తి అవతారంగా పోల్చడాన్ని సనాతన బాహ్యమైనవిగా తిరస్కరించారు. సావర్కర్ చెప్పిన భారత్‌ను పుణ్యభూమిగా చేసుకున్నవాళ్లే స్వదేశీయులు అనే సిద్ధాంతాన్ని, ఇది విదేశాలలో పౌరులైన హిందువులకు కూడా ముప్పు అని కరపాత్రి తిరస్కరించారు. అందుకే విదేశాలలో భారతీయులు ఎదుర్కొంటున్న మత వివక్షని ఇప్పుడు మనం చూస్తున్నాం. సావర్కర్ సైతం తన 'హిందుత్వ' గ్రంథంలో సనాతన ధర్మం వేరని, తాను ప్రతిపాదిస్తున్న రాజకీయ హిందుత్వ వేరని స్పష్టం చేశారు. సనాతన ధర్మం బహుళత్వాన్ని అంగీకరిస్తుంది; కానీ హిందుత్వ జాతీయ ఏకీకరణను కోరుకుంటుంది. సావర్కర్ వైదిక సనాతన ధర్మానికి మూలస్తంభాలైన 'శ్రుతి--స్మృతులను' తన చారిత్రక భౌతికవాదంతో పడగొట్టాలని చూశారు. పాశ్చాత్య ఫాసిస్ట్ దృక్పథాన్ని ఆశ్రయించారు. కన్నడ రచయిత భైరప్ప కూడా తన జీవితాంతం చరిత్రను ప్రాతిపదికగా చేసుకోవడం వల్లే, ఆయన తాత్త్విక ప్రయాణం 'ఆవరణ' వంటి నిర్దిష్ట రాజకీయ కోణాల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో
## నేటి నుండి అలంపూర్‌లో 3 రోజులు ప్రజా పాలన-ప్రగతి నివేదిక బస్సు యాత్ర



**మొదటి మూడు రోజులు అలంపూర్ నియోజకవర్గంలో జోగులాంబ అమ్మవారి దేవాలయం నుంచి ప్రారంభం**
**మల్లు రవి తో కలిసి రూట్ మ్యాప్ సిద్ధం చేసిన మాజీ ఎమ్మెల్యే.సంపత్ కుమార్**

**(సమయం ప్రతినిధి అలంపూర్) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారంలో భాగంగా నాగర్ కర్నూల్ పార్లమెంటులో ప్రజా పాలన ప్రగతి - నివేదిక బస్సు యాత్రను నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి , ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ కలిసి జూన్ 2 వ తేదీన మధ్యాహ్నం 01:00 గంటకు అలంపూర్ జోగులాంబ అమ్మవారి దేవాలయం నుంచి ప్రారంభించబడును. జోగులాంబ అమ్మ వారి దర్శనం ,మరియు వాహన పూజ అనంతరం నాగర్ కర్నూల్ పార్లమెంటు లో మొదటి మూడు రోజులు తేదీ జూన్ 2,3,4 న అలంపూర్ నియోజకవర్గంలో తదుపరి మూడు రోజులు గద్వాల్ నియోజకవర్గంలో బస్సు పర్యటన ఉంటుంది. కనుక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానులు నాయకులు వేలాదిగా మంగళవారం మధ్యాహ్నం 01 :00 గంటలకు జోగులాంబ అమ్మవారి ఆలయం వద్దకు పెద్ద ఎత్తున హాజరై ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

## తెలంగాణ ప్రభుత్వం క్రొత్తగా ఇచ్చే పెన్షన్‌లలో
## బీడీ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి జీవన భృతి పెన్షన్ ఇవ్వాలి

**(సమయం ప్రతినిధి ఆత్మకూరు) :** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని బీడీ పనిపై ఆధారపడి జీవిస్తున్న బీడీ కార్మికులకు జీవన భృతి పెన్షన్‌లు గత ప్రభుత్వం పూర్తిగా బీడీ చేసే వారందరికీ ఇవ్వకుండా కొంతమంది కి మాత్రమే ఇచ్చి మిగతా వారికీ ఇప్పుడు అప్పుడు అంటు బీడీ కార్మికుల పెన్షన్ లాగిన్ లాక్ చేసి కాలం గడిపారు తర్వాత అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ లు పెంచుతామాని, కొత్త పెన్షన్ లు ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాల 6 నెలలు దాటింది ఇప్పుడు జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొత్త పెన్షన్ లు బీడీ కార్మికులకు, వికలాంగులకు,విడో, వృద్దుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోమని అధికారులు ప్రకటన చేశారు. కనుక ఆత్మకూర్ మండలం లోని ప్రధానంగా బీడీ కూలీ పై ఆధారపడి జీవించే గ్రామాలు మూలమళ్ళ, ఖానాపూర్, పిన్నేంచర్ల, ఆత్మకూర్, జూరాల గ్రామాలలో ఉన్న బీడీ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా బీడీ కార్మికులకు పెన్షన్‌లు ఇచ్చేటట్లుగా జిల్లా మరియు మండల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూర్ మండల MPDO శ్రీరామ్ రెడ్డి కి కార్మికులతో కలిసి బీడీ కార్మికుల జీవన భృతి



దరఖాస్తులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్(TUCI)జిల్లా కార్యదర్శి సి రాజు, కార్మికులు పరిమళ, ప్రభావతి, బేబీ,తిరుపతమ్మ,పావని, k జ్యోతి, ఆశాలత, D శ్యామల, k మాసమ్మ, కిష్టమ్మ, మాసమ్మ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరచింతలో ఎస్బిఐ బ్రాంచ్‌ని ఏర్పాటు చేయాలి
## మేనేజర్ కు అఖిలపక్షం విజ్ఞప్తి



**(సమయం ప్రతినిధి అమరచింత) :** అమర చింత మండల కేంద్రం లో ప్రజల అవసరాల నిమిత్తం SBI బ్యాంకు ఏర్పాటు చేయాలని సోమవారం నాడు అమర చింత అఖిలపక్ష పార్టీలు,అమర చింత వాసులుఆధ్వర్యం లో ఆత్మకూరు SBI బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులుకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అమరచింత మున్సిపాలిటీ మండలకేంద్రం అయినప్పటికీ ఒకే ఇక యూనియన్ బ్యాంకు ఉండడం తో వేల అకౌంట్లు ఉన్నందునప్రతి రోజు ప్రజలు బ్యాంకు కు వెళ్లాలంటే రోజు మొత్తం పనులు వదులు కొని వెళ్లాల్సి వస్తున్నదని వాపోయారుఇదివరకు అధికారులదృష్టికి ఇ సమస్య తెలియజేయడం జరిగిందని వివరించారు..ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ మంగ లావణ్య, కో ఆప్షన్ సభ్యులు యస్.అజయ్, నర్సింలు గౌడ్, జె.రాజన్న ,కె.లక్ష్మీ నారాయణ ,యస్.మస్లమని .ఎ ,రవీందర్ మాజీ సర్పంచ్ గోపాల్ ఎ.రఘు,కె.విజయ్,ఎ వెంకటస్వామి, రఫీ,ఫిరోజ్,కవి తిరుమలేశ్.అడ్వాకెట్, రామచందర్, రవి కుమార్ లు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో సిజేరియన్ల జోరు

**నిజామాబాద్ :** భారతదేశంలో సిజేరియన్ (సి-సెక్షన్) ప్రసవాల సంఖ్య ఏటా ఊహించని విధంగా పెరుగుతోంది. వైద్యపరంగా అత్యవసర పరిస్థితుల్లో తల్లీ, బిడ్డల ప్రాణాలను రక్షించడానికి చేసే ఈ శస్త్రచికిత్స.. ప్రస్తుతం దేశంలో ఒక సాధారణ ప్రక్రియగా మారిపోతోందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం ఒక ప్రాంతంలో సి-సెక్షన్ ప్రసవాల రేటు 10 నుండి 15 శాతం లోపు మాత్రమే ఉండాలి. కానీ, భారతదేశంలో ఈ సంఖ్య సగటున 27.2 శాతానికి చేరుకుంది.ఈ నివేదిక ప్రకారం, దేశంలోనే అత్యధికంగా సి-సెక్షన్ ప్రసవాలు జరుగుతున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. తెలంగాణలో దాదాపు 62.2 శాతం ప్రసవాలు శస్త్రచికిత్సల ద్వారానే జరుగుతున్నాయి. అంటే రాష్ట్రంలో పుడుతున్న ప్రతి 10 మంది పిల్లలలో ఆరుగురు సి-సెక్షన్ ద్వారానే జన్మిస్తున్నారు. దీని తర్వాత పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ 52.2 శాతంతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. దీనికి విరుద్ధంగా నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాలలో అత్యల్పంగా 13.2 శాతం సి-సెక్షన్ రేటు నమోదైంది.

### ప్రైవేట్ ఆసుపత్రుల్లో భారీ దోపిడీ లేదా అవసరమా?

ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే ప్రైవేట్ హెల్త్‌కేర్ సెంటర్లలో సి-సెక్షన్ల రేటు అత్యంత ఆందోళనకరంగా ఉంది. తెలంగాణలోని ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాలలో ఏకంగా 83.9 శాతం సిజేరియన్లే కావడం గమనార్హం. జాతీయస్థాయిలో ప్రైవేట్ ఆసుపత్రుల సగటు 54.1 శాతంగా ఉంది. అదే సమయంలో తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా సి-సెక్షన్ రేటు 48.1 శాతంగా నమోదైంది.

## పంట విరామానికి రెడీ అవుతున్న అక్వా రంగం

భీమవరం : ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే కీలకమైన ఆక్వా రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. సిండికేట్‌ల దెబ్బకు కుదేలవుతున్న ఆక్వా రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా పంట విరామం ప్రకటిస్తామని ఆక్వా రైతుల రాష్ట్ర సమన్వయ కమిటీ అల్టిమేటం జారీ చేసింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశంలో రైతులు తమ ఆవేదనను, డిమాండ్లను వెల్లడించారు. డాలర్ల పంటగా పేరుగాంచిన ఆక్వా పరిశ్రమను సిండికేట్ వ్యవస్థలు పట్టి పీడిస్తున్నాయి. అమలాపురంలో జరిగిన ఆక్వా రైతు సంఘాల సమావేశంలో రైతులు ముక్తకంఠంతో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎగుమతిదారులు , మేత తయారీదారులు, హేచరీల యజమానులు ఒక సిండికేట్‌గా ఏర్పడి ధరలను శాసిస్తున్నారని, దీనివల్ల సామాన్య రైతు నిలువునా మునిగిపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించకపోతే, ఆక్వా సాగును నిలిపివేయడం మినహా తమకు మరో మార్గం లేదని స్పష్టం చేశారు.ఆక్వా సాగులో విత్తనం దశ నుంచే మోసం మొదలవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని హేచరీలు నాణ్యత లేని సీడ్‌ను పంపిణీ చేయడం వల్ల పంట ఆరంభంలోనే దెబ్బతింటోందని వారు పేర్కొన్నారు. దీనికి తోడు, మేత ధరలు అమాంతం పెంచి రైతుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల మేత ధరల పెరుగుదలపై రైతులు నిరసన తెలపడంతో, దానికి ప్రతీకారంగా ఎగుమతిదారులు రొయ్యల కొనుగోలు ధరలను కిలోకు రూ. 50 వరకు తగ్గించేశారని, దీనివల్ల టన్నుకు రూ. 50 వేల చొప్పున రైతులు భారీగా నష్టపోతున్నారని గణాంకాలతో వివరించారు.విద్యుత్ సబ్సిడీ విషయంలో కూడా ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని రైతులు ధ్వజమెత్తారు. ఆక్వా జోన్, నాన్-ఆక్వా జోన్ అనే తేడాలు లేకుండా సాగు చేసే ప్రతి రైతుకు సబ్సిడీ విద్యుత్తును అందించాలని వారు డిమాండ్ చేశారు. గతంలో నిలిపివేసిన నాన్-ఆక్వా జోన్ పరిధిలోని 12 వేల విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పరిమితులు ఆక్వా సాగును మరింత భారంగా మారుస్తున్నాయని, ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో మన రొయ్యల పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ఆక్వా రైతు సమన్వయ కమిటీ ని ఈ సమావేశంలో ఏర్పాటు చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** ప్రజావాణిలో స్వీకరించిన అర్జిదారుల దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్, ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్, పంచాయతీరాజ్, ఉపాధి కల్పన, గృహ నిర్మాణం, సంక్షేమం, భూ సర్వే రికార్డులు, రోడ్డు రవాణా, పోలీసు, విద్య, వైద్యం, విద్యుత్, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 148 వినతులను అధికారులు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జూన్ 2న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఐడీఓసీలో నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.



ఉదయం అమరవీరుల స్మారక స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం జిల్లా సమీకృత కార్యాలయంలో గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. అనంతరం తెలంగాణ గీతాలాపన, మంత్రివర్యుల సందేశం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల స్టాళ్ల సందర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రజావాణి అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ప్రజావాణి పోర్టల్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కొన్ని శాఖలు ఇప్పటివరకు పోర్టల్‌లో లాగిన్ కాలేదని పేర్కొంటూ, వెంటనే లాగిన్ అయి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయం, భూ సర్వే రికార్డుల శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పురోగతిని సమీక్షించిన ఆయన, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఉపాధి అధికారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ అల్లం నిర్మల, జెడ్పీసీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిట్టీల పేరుతో మరో మోసం

### దాదాపు 5కోట్లకు పైగా డబ్బులతో ఉడాయించిన వ్యాపారి

**(సమయం ప్రతినిధి జోగులాంబ గద్వాల జిల్లా):** జిల్లాలోని మల్దకల్ మండలం,బిజ్వారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చిట్టిలా పేరుతో చాలమందితో పరిచయం పెంచుకుని చిట్టిలు వేయించుకుని దాదాపు 5కోట్ల రూపాయలకు పైగ డబ్బులతో ఉడాయించినట్లు తెలుస్తుంది..కగా బాధితులు ఒక్కోక్కరుగా బయటకు వస్తు లబోదిబో మంటున్నారు...ఇట్టి విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా తమకు ఇప్పటివరకు ఎలాంటి పిర్యాదు రాలేదని తెలిపారు..సంఘటన సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి



**ప్రజావాణికి 80 ఫిర్యాదులు**

**(సమయం ప్రతినిధి గద్వాల) :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు మధు మోహన్, నర్సింగ రావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణలతో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ వారం వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 80 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ ఫైల్స్ ను జూన్ 15వ తేదీ లోగా క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చివరి దశకు కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్టరింగ్

వరంగల్ : తెలంగాణలో మరో చారిత్రాత్మక రైల్వే ప్రాజెక్ట్ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. భారతీయ రైల్వేస్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ రోలింగ్ స్టాక్ తయారీ కేంద్రం నుండి.. రాబోయే ఐదేళ్లలో వందలాది సరికొత్త ఇంటర్‌సిటీ రైళ్లు పట్టాలెక్కబోతున్నాయి. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూలు ఉన్నతాధికారులతో కలిసి ఈ ప్రాజెక్ట్ పురోగతిని పర్యవేక్షించారు. ఇండియన్ రైల్వేస్‌లో కాజీపేట మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఒక బహుముఖ శ్రేణి ఫ్యాక్టరీగా అవతరించబోతోంది. ప్రారంభంలో భాగంగా.. ఈ ఫ్యాక్టరీ నుండి రాబోయే 5 సంవత్సరాలలో 200 అత్యాధునిక ఇంటర్‌సిటీ షటిల్ రైళ్లను తయారు చేయాలని కేంద్ర రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రైళ్లను దేశవ్యాప్తంగా ఉన్న వివిధ నగరాలు, పట్టణాల మధ్య తక్కువ దూర ప్రయాణాల కోసం మోహరించనున్నారు.

## జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీలు





**జడ్చర్ల, సమయం ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ డి. జానకి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌ల నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్లు, అనుమానితుల జాబితాలు, బీట్ పుస్తకాలు, స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి దశలో పారదర్శకత, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసు శాఖ అధిపతి సి.వి. ఆనంద్ ఆదేశాలను సిబ్బందికి వివరిస్తూ, నిష్పక్షపాత విధుల నిర్వహణ ద్వారానే ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు.జాతీయ రహదారి-44పై పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పర్యవేక్షణ, అవసరమైన చోట ప్రత్యేక బందోబస్తు చర్యలు అమలు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ వంటి అంశాలను కూడా పరిశీలించిన ఎస్పీ, స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా పలకరించి, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయాలను తగ్గించవచ్చని తెలిపారు. పోలీసులే ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొంటూ, హెల్మెట్ లేకుండా వచ్చే సిబ్బందిని స్టేషన్‌లోకి అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు.అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, వారి విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత ఇబ్బందులు ఉన్న సిబ్బంది ప్రతి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేరుగా తనను కలవవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఎస్ఐలు జయప్రసాద్, ఖాదర్, అక్షయదీప్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**(సమయం ప్రతినిధి జోగులాంబ గద్వాల) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ నిషేధానికి చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న పర్యావరణ వారోత్సవాలను పురస్కరించుకొని అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగిల్ యూజు ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో ఈ కవర్లను వినియోగించకుండా పౌరులందరూ సహకరించాలన్నారు. ఈనెల ఐదున ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీలలో, గ్రామపంచాయతీలలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలువురు జిల్లా అధికారులతో కలిసి ప్లాస్టిక్ నిషేధంపై ముద్రించిన గోడపత్రికలను విడుదల చేశారు. మే 31న వరల్డ్ నో టొబాకో డే పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన



### డ్రగ్స్ రహిత జిల్లాకు కృషి చేయాలి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసంగించారు. జిల్లాలో డ్రగ్స్ నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ రహిత జిల్లాకు కృషి చేయాలన్నారు. పొగాకు ఉత్పత్తులను తీసుకోవడం వలన కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ ఇండియా పేరుతో ముద్రించిన గోడ పత్రికలను కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. అనంతరం పొగాకు ఉత్పత్తులు తీసుకోకుండా ఉండాలనే ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, అటవీ శాఖ రేంజ్ అధికారి పర్వీజ్ అహ్మద్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి రాష్ట్ర అవతరణ దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎస్పీ





(సమయం ప్రతినిధి నాగర్ కర్నూల్) : నాగర్ కర్నూల్ జిల్లా, పట్టణంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో మంగళవారం 13వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ముఖ్య అతిథి ఉదయం 8:00 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ చేస్తారని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూల్ పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ దేవ సహాయం లతో కలిసి వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఉదయం 7:35 గంటలకు జిల్లా ఎస్పీ, 7:45 గంటలకు జిల్లా కలెక్టర్, 7:50 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ తరపున జిల్లా ముఖ్య అతిథి జి. చిన్నారెడ్డి వేడుకల ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. ముఖ్య అతిథి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఉదయం 7:52 గంటలకు తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం ఉదయం 8:00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, 8:05 గంటలకు పోలీసుల కవాతు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఉదయం 8:15 గంటలకు ముఖ్య అతిథి జిల్లాలో అమలవుతున్న రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం 8:50 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 9:10 గంటలకు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్ సందర్శన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉదయం 9:30 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. వేడుకలకు వచ్చే ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల కోసం తగిన సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సదుపాయాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమ సమయాలను అనుకూలంగా నిర్ణయించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, మేధావులు, పాత్రికేయులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ కోరారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ ఆర్డిఓ సురేష్ బాబు, తాహసిల్దార్ తబితా రాణి వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.


## మళ్లీ తెలంగాణ సెంటిమెంట్

హైదరాబాద్ : తెలంగాణలో మరోసారి పాత ప్రాంతీయ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి దశాబ్దం క్రితం నాటి ఉద్యమ కాలపు భావోద్వేగాలను మళ్లీ రగిల్చి, రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా తెరవెనుక వ్యూహాలు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై చేసిన ఒక విశ్లేషణ, దానికి ఏపీ నేతల నుంచి వచ్చిన ప్రతిస్పందనల చుట్టూ ఇప్పుడు తెలంగాణలో పెద్ద రాజకీయ వివాదమే నడుస్తోంది. దీనిని తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంగా మలిచేందుకు ఒక వర్గం గట్టి ప్రయత్నాలు చేస్తోంది.ముఖ్యంగా ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను టార్గెట్ చేస్తూ సాగుతున్న ఈ పరిణామాలు.. రాబోయే స్థానిక సంస్థలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం పొలిటికల్ గ్రౌండ్ సిద్ధం చేసుకునే వ్యూహంలో భాగమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏపీ రాజకీయాలపై విశ్లేషణలు చేయడం ఇదేం మొదటిసారి కాదు. అయితే ఈసారి ఆయన వ్యాఖ్యలపై ఏపీ నేతలు స్పందించిన తీరును సాకుగా చూపి, కొందరు నేతలు దీనిని తెలంగాణ సమాజంపై దాడిగా చిత్రీకరిస్తున్నారు. ఏపీ నేతలు తెలంగాణ మేధావులను, వ్యక్తులను గౌరవించడం లేదనే భావనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా పాత సెంటిమెంట్‌ను రగిల్చవచ్చని భావిస్తున్నారు.ఈ వివాదంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు నేరుగా మైకుల ముందుకు వచ్చి మాట్లాడకపోయినప్పటికీ, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగాలు మాత్రం అత్యంత దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గతంలో తెలంగాణపై చేసిన వ్యాఖ్యలను, చంద్రబాబు పాత రాజకీయాలను తవ్వి తీస్తూ రీల్స్, పోస్టులతో హోరెత్తిస్తున్నారు. నేరుగా విమర్శిస్తే ప్రజల్లో వచ్చే నెగెటివ్ ఇంపాక్ట్‌ను నివారించేందుకు, సోషల్ మీడియా ద్వారా సెంటిమెంట్ మంటను రాజేసే బాధ్యతను కింది స్థాయి కేడర్‌కు అప్పగించినట్లు స్పష్టమవుతోంది.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసి, టీడీపీ సానుభూతిపరులకు, సెటిలర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. దీనికి విరుగుడుగా ఇప్పుడు విపక్షాలు నాగేశ్వర్ ఇష్యూను చేతుల్లోకి తీసుకున్నాయి. తెలంగాణ గడ్డపై ఏపీ నేతల పెత్తనం ఏంటి? అనే పాత నినాదాన్ని మళ్లీ తెరపైకి తెస్తూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏపీ ప్రయోజనాల పరిరక్షకుడిగా, ఏపీ నేతలకు లొంగిపోయిన సర్కార్‌గా ముద్ర వేసే ప్రయత్నం జరుగుతోంది.ముఖ్యంగా పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా ఆయన అభిమానులను రెచ్చగొట్టి, తద్వారా వచ్చే ఘర్షణ వాతావరణాన్ని రాజకీయంగా వాడుకోవాలనేది ఈ 'షాడో పాలిటిక్స్' అసలు ప్లాన్ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని సెటిలర్ల ఓటు బ్యాంకును చీల్చడం లేదా ప్రభావితం చేయడమే దీని వెనుక ఉన్న బలమైన వ్యూహం. దశాబ్దం క్రితం ఉన్నంత తీవ్రస్థాయిలో ఇప్పుడు సెంటిమెంట్ రాజకీయాలు పనిచేస్తాయా అనేది పెద్ద సందేహమే. గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు పెరిగాయి. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య వ్యాపార, వాణిజ్య లావాదేవీలు విడదీయలేని విధంగా ముడిపడి ఉన్నాయి. నేటి తెలంగాణ యువత కేవలం సెంటిమెంట్ వైపు కాకుండా ఉద్యోగాలు, ఐటీ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు మరియు సంక్షేమం గురించి ఆలోచిస్తోంది. కేవలం వ్యక్తుల మధ్య జరిగే మాటల యుద్ధాన్ని ప్రాంతీయ పోరాటంగా మార్చాలని చూస్తున్న రాజకీయ శక్తుల ఉద్దేశాన్ని సామాన్య ప్రజలు సైతం గమనిస్తున్నారు. ఏపీ రాజకీయాలపై నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలకు సమాధానం అక్కడి నుంచే రావాలి కానీ, దానిని తెలంగాణ సమస్యగా మార్చడం అంటే అభివృద్ధి అజెండా నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ఈ పవన్-బాబు టార్గెట్ పాలిటిక్స్ రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. అయితే, ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్న తరుణంలో.. కేవలం సెంటిమెంట్‌ను నమ్ముకుని చేసే ఈ కృత్రిమ రాజకీయాలు ఎంతవరకు ఫలిస్తాయో కాలమే నిర్ణయించాలి.

## బాలరాజుకు పవన్ మాస్ వార్నింగ్

ఏలూరు : పోలవరం రాజకీయాల్లో ఒక్కసారిగా ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో.. ఈ మధ్య జనసేనాని పవన్ వన్ టు వన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మామూలుగా రివ్యూలు అంటే నియోజకవర్గాల అభివృద్ధిపై జరుగుతాయ్. ఐతే వివాదాలపై ఎమ్మెల్యేకు క్లాస్ తీసుకున్న పవన్.. వాటిని సెట్‌రైట్ చేసుకునేందుకు నాలుగు వారాల డెడ్‌లైన్ ఇచ్చారు. ఇదే ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. నాలుగు వారాల్లో బాలరాజు అంతా క్లియర్ చేసుకుంటారా.. ఒకవేళ చేసుకోకపోతే పరిస్థితి ఏంటి.. అసలు ఆయనకు ఎందుకు పవన్ డెడ్‌లైన్ విధించారు.. ఆయన చుట్టూ ఉన్న వివాదాలు ఏంటి అని ఏపీ రాజకీయాల్లో డిస్కషన్ కనిపిస్తోంది.పంచాయితీల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం 147 కోట్ల నిధులు కేటాయించగా.. క్షేత్రస్థాయిలో పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలుస్తోంది. దీనిపై పవన్ నిలదీసినట్లు తెలుస్తోంది.

## ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు : జిల్లా ఎస్పీ డి. జానకి



మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి: ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా ఎస్పీ డి. జానకి స్పష్టం చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా కుటుంబ వివాదాలు, భూ తగాదాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను బాధితుల నుంచి విని, సంబంధిత పోలీసు అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి, చట్టపరమైన చర్యల ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి అధికారి ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ స్పందనాత్మకంగా పనిచేయాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, సైబర్ మోసాలకు గురైన బాధితుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### ప్రజావాణికి 80 ఫిర్యాదులు



(సమయం ప్రతినిధి గద్వాల) : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు మధు మోహన్, నర్సింగ రావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణలతో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ వారం వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 80 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ ఫైల్స్ ను జూన్ 15వ తేదీ లోగా క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ కార్డులు...అమెరికా యూ టర్న్...

ముంబై : ఇటీవల అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) గ్రీన్ కార్డు దరఖాస్తులకు సంబంధించిన మార్గదర్శకాల్లో మార్పులపై చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసింది. అమెరికాలో ఉంటూ శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే వలసదారులు.. ఇకపై తమ స్వదేశానికి వెళ్లి ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుందని తెలిపింది. దరఖాస్తులను కేసు వారీగా అధికారులు పరిశీలించి, ప్రత్యేక మినహాయింపునకు అర్హులా? కాదా? అని అంచనా వేయాలని స్పష్టం చేసింది. దీంతో వలసదారుల్లో ఆందోళన వ్యక్తం కాగా.. యూటర్న్ తీసుకుంది.అమెరికాలో వలసదారులకు శాశ్వత నివాసం హోదా కల్పించే గ్రీన్ కార్డు నిబంధనల విషయంలో డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం వెనక్కి తగ్గింది. గ్రీన్ కార్డు దరఖాస్తు ప్రక్రియను వలసదారులు తమ స్వదేశంలో చేసుకోవాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసిన విషయం తెలిసిందే. అయితే, పాత విధానం ప్రకారం అమెరికాను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రకటించినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలను వెలువరించింది.ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పులు కాదని హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ విభాగం వివరణ ఇచ్చింది. గ్రీన్‌కార్డు దరఖాస్తుదారుడు అమెరికాలో ఉండి పూర్తిచేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అనేది ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని పేర్కొంది. ఈ నిబంధన చాలాకాలం నుంచి అమల్లో ఉందని తెలిపింది. మే 21న ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశం ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తుచేయడం తప్పా కొత్తదేమీ కాదని డీహెచ్ఎస్ ప్రతినిధి పేర్కొన్నారు. గ్రీన్ కార్డు కోసం వలసదారుల దరఖాస్తుల పరిశీలన జరుగుతున్నప్పుడు కూడా వారు అమెరికాలో ఉండేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. తాజా ప్రకటనతో అమెరికాలో శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకున్న భారతీయులకు భారీ ఊరట లభించినట్టయ్యింది. అమెరికాలో నివసిస్తున్న విదేశీయుల్లో చైనా (52 లక్షలు) తర్వాతి స్థానం భారతీయులదే.వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండిపోవడం లేదా ఇమిగ్రేషన్‌కు సంబంధించిన ఇతర అంశాలను మాత్రం తాము పరిగణనలోకి తీసుకుంటామని సూచనప్రాయంగా తెలిపింది.

# రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరించుట నేరం : ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం

(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్): ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసుల నుంచి నోటీసులు రావడంతో తాను, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎదుట హాజరై మా స్టేట్మెంట్లను నమోదు చేయించామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నా ఫోన్‌తో పాటు నా కుటుంబ సభ్యులు, నాతో మాట్లాడే వ్యక్తులు, జర్నలిస్టులు సహా వేలాది మంది ఫోన్లను ట్యాప్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై డీజీపీ, పోలీస్ కమీషనర్‌కు ఫిర్యాదు చేసి, ఈ కుట్ర వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించాలని కోరాను. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు. రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కులైన ఆర్టికల్ 14, ఆర్టికల్ 19లకు విరుద్ధంగా జరిగిన చర్య.రాజ్యాంగాన్ని, పౌరుల స్వేచ్ఛను కాపాడతామని ప్రమాణం చేసిన వారు తమ స్వార్థ రాజకీయాల కోసం ఆ ప్రమాణాలను ఉల్లంఘించారు.ఈ ట్యాపింగ్ వ్యవహారంలో భాగస్వాములైన వారెవరైనా, వారు ఎంతటి ఉన్నత పదవుల్లో ఉన్నా చట్టం ముందు జవాబుదారీగా నిలబడాలన్నారు.డీజీపీ నుంచి కానిస్టేబుల్ వరకు, ఎమ్మెల్యే నుంచి ముఖ్యమంత్రి వరకు బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఒకప్పుడు నిఘా పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడాం. కానీ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను రాష్ట్రని ఒక నిఘా




నీడలో మార్చే ప్రయత్నం జరిగిందని ప్రజా సమస్యలను పరిష్కరించి గెలవలేక, ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసి, వారి వ్యక్తిగత సమాచారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించాలనే కుట్ర జరిగిందన్నారు.కొంతమంది పోలీసు అధికారులు సేకరించిన సమాచారాన్ని అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు చేరవేసి, ఆ సమాచారంతో రాజకీయ ప్రత్యర్థులను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయన్నారు.రాజకీయ నాయకులతో పాటు న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, సాధారణ పౌరుల ఫోన్లు కూడా ట్యాప్ అయినట్లు వివిధ కథనాలు వెలుగులోకి వచ్చాయని జూన్ నెలలో చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ వ్యవస్థీకృత నేరానికి పాల్పడిన వారిపై న్యాయస్థానాలు కఠిన చర్యలు తీసుకుంటాయని నమ్ముతున్నానన్నారు.గత పదేళ్లలో వేలాది మంది ఫోన్లను వినిపించిన వారు మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు మరింత ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పౌరుల స్వేచ్ఛను హరించి, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసిన వారికి ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు ఇచ్చారు.కల్వకుంట్ల కుటుంబంలోని నలుగురు రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడం కోసం ఇటువంటి ధోరణులను అవలంబించారన్నారు. Telangana was not created to become a Surveillance State. తెలంగాణ రాష్ట్రం ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం ఏర్పడింది. కానీ బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను Surveillance Stateగా మార్చారనే తీవ్రమైన ఆరోపణలపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే బీసీ పొలిటికల్ జెఎసి ఎజెండా

**జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటుగా మహేందర్ నాయుడు నియామకం**
**దశాబ్ద కాలంగా ప్రతిపక్ష పాత్రతో అవినీతిపరుల భరతం పడుతున్నాం**
**బీసీ పొలిటికల్ జేఏసీకి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి వెన్నంటి ఉంటాం**
**బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**

(సమయం ప్రతినిధి వనపర్తి) : ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఎజెండాగా భావించి బీసీ పొలిటికల్ జేఏసీ ముందుకు సాగుతుందని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు కార్యక్రమంలో....మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామానికి చెందిన బి.మహేందర్ నాయుడును బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటుగా రాచాల నియమించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.... నేడు మదనపురం మండలంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా మహేందర్ నాయుడు ముందుండి ప్రజల పక్షాన పోరాటం సాగిస్తున్నాడని, ఆయన సేవలు ఒక మండలానికి పరిమితం కాకుండా జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటుగా నియమిస్తున్నట్లు తెలిపారు. గత దశాబ్ద కాలంగా బీసీ పొలిటికల్ జేఏసీ నిర్వహిస్తున్న అనేక ఉద్యమాలలో మహేందర్ నాయుడు చురుకైన పాత్ర పోషించాడని అన్నారు. గొప్ప పోరాట పటిమ కలిగిన నాయకుడు వర్కింగ్ ప్రెసిడెంటుగా ఉంటే బీసీ పొలిటికల్ జేఏసీ మరింత బలపడుతుందనే నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. నేటినుంచి జిల్లాలోని అన్ని మండల



కమిటీలు నాయకులు మహేందర్ నాయుడు నాయకత్వంలో మరింత చురుకుగా పాలుపంచుకుంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. గత దశాబ్ద కాలంగా బీసీ పొలిటికల్ జేఏసీకి ఏ విధంగా సహకరించారో మహేందర్ నాయుడుకు కూడా అదేవిధంగా ప్రోత్సహించి వెన్ను తట్టి నిలవాలని ప్రజలకు, బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులకు, మీడియాకు విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి ప్రతిపక్ష పాత్ర పోషించడమే కాకుండా రాష్ట్రస్థాయిలో అవినీతికి పాల్పడుతున్న అధికారుల భరతం పట్టడంలో కూడా ముందు నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్ నాయకులు బాలవర్ధన్, రాములు, కురుమూర్తి, ఉదయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాలోసభలు, ర్యాలీలు నిషేధం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు : జిల్లా ఎస్పీ

**జూన్ -1 నుంచి 30 వరకు “30 పోలీస్ యాక్ట్” అమలు**
**ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధం**
**ప్రజల సహకారంతోనే శాంతిభద్రతలు సాధ్యం ఎస్పీ**

(సమయం ప్రతినిధి వనపర్తి,) : జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజల సాధారణ జీవనాన్ని నిరంతరాయంగా కొనసాగించడం, అనవసర గుమికూడింపులు నివారించడం లక్ష్యంగా జూన్ -01 నుంచి జూన్ -30 వరకు 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా పరిధిలో ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎవరైనా పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం కఠినంగా నిషేధం. ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటిలేదు” అని స్పష్టం చేశారు. అలాగే “30 పోలీస్ యాక్ట్” ఉల్లంఘనలకు చట్టంలో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయి... అందరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఎస్పీ గారు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఏ కార్యక్రమం కావాలన్నా ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి పొందండి. ప్రజల సహకారం వల్లనే శాంతిభద్రతలు నిలుస్తాయి. పోలీసుల చర్యలు ప్రజల రక్షణ కోసమేనని ఎస్పీ తెలిపారు.



## అందుబాటులోకి రానున్న పాలిమర్ నోట్లు

ముంబై : భారతీయ రిజర్వ్ బ్యాంక్ దేశంలో కరెన్సీ నిర్వహణ ఖర్చును తగ్గించేందుకు , నోట్ల మన్నికను పెంచేందుకు విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టబోతోంది. త్వరలోనే సాధారణ కాగితపు నోట్ల స్థానంలో ప్లాస్టిక్ నోట్లను ప్రయోగాత్మక ప్రాతిపదికన ప్రవేశపెట్టాలని కేంద్ర బ్యాంకు యోచిస్తోంది. భారతదేశంలో కరెన్సీ నోట్ల ముద్రణ ఖర్చు ఏటా భారంగా మారుతోంది. ఖీఃఎ వార్షిక నివేదిక ప్రకారం, నోట్ల ముద్రణ వ్యయం గత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,101.4 కోట్ల నుండి రూ. 6,372.8 కోట్లకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం చిరిగిపోయిన లేదా పాడైపోయిన నోట్లను ఉపసంహరించుకుని వాటి స్థానంలో కొత్తవి ముద్రించాల్సి రావడమే. కేవలం ఒక్క ఏడాదిలోనే సుమారు 23.8 బిలియన్ల పాత నోట్లను మార్కెట్ నుండి వెనక్కి తీసుకున్నారు. ఇందులో రూ. 500. రూ. 100 నోట్లే అధికంగా ఉన్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా పాలిమర్ నోట్లను పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రవేశపెట్టాలని ఆర్‌బీఐ భావిస్తోంది.పాలిమర్ నోట్లు అంటే సింథటిక్ ప్లాస్టిక్ మిశ్రమంతో తయారయ్యే కరెన్సీ. ఇవి సాధారణ కాగితపు నోట్ల కంటే సుమారు 2.5 రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. కాగితపు నోట్లు త్వరగా చిరిగిపోవడం, తడిసిపోవడం లేదా మురికి కావడం వంటి సమస్యలు ఉంటాయి. కానీ, ప్లాస్టిక్ నోట్లు నీటికి తడిసినా ఏమీ కావు, వీటిని అంత సులభంగా చించివేయలేము. మన్నిక ఎక్కువగా ఉండటం వల్ల వీటిని పదేపదే ముద్రించాల్సిన అవసరం ఉండదు, ఫలితంగా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ముద్రణ ఖర్చు ఆదా అవుతుంది.ప్లాస్టిక్ నోట్లను నకిలీ చేయడం అంత సులభం కాదు. వీటిలో అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఉంటాయి. పారదర్శకమైన ప్లాస్టిక్ విండోస్, లోహపు పొరలు అతినీలలోహిత కాంతికి స్పందించే రసాయన గుర్తులు వంటివి ఉండటం వల్ల దొంగ నోట్ల బెడదనుసమర్థవంతంగా అరికట్టవచ్చు.

## ఎన్టీఆర్ నామం.. రేవంత్ వ్యూహం

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ఎత్తుగడలు ఎప్పుడూ ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా ఉంటాయి. తాజాగా అమీర్‌పేట మైత్రివనం వద్ద ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఉదంతం కేవలం ఒక విగ్రహావిష్కరణగా కాకుండా, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం ఆయన వేసిన భారీ రాజకీయ స్కెచ్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉండి, గతంలో ఎన్టీఆర్ తో ఉన్న ఉన్న కాంగ్రెస్ వైరం చరిత్రను పక్కన పెట్టి రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ జపం చేయడం వెనుక బలమైన రాజకీయ కారణం ఉంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన వారు, స్థానికంగా ఉన్న తెలుగుదేశం సానుభూతిపరులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణలో టీడీపీ క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండటంతో, ఆ పార్టీ కోర్ ఓట్ బ్యాంక్ అనాథగా మారింది. ఈ శూన్యాన్ని భర్తీ చేసి, ఆ ఓట్లను కాంగ్రెస్ ఖాతాలోకి మళ్లించడమే రేవంత్ అసలు లక్ష్యం.సాధారణంగా తెలుగుదేశం సానుభూతిపరులు మొదటి నుంచీ కాంగ్రెస్ వ్యతిరేక భావజాలంతో పెరిగిన వారు. ఎన్టీఆర్ పెట్టిన కాంగ్రెస్ వ్యతిరేక పునాదులే వారి రాజకీయ సిద్ధాంతం. మరి అలాంటి వారు కాంగ్రెస్‌కు ఓటు వేయాలంటే, ఆ పార్టీలో తమకు నచ్చిన వ్యక్తి ఉండాలి. రేవంత్ రెడ్డి సరిగ్గా ఆ పల్స్‌ను పట్టుకున్నారు. తాను కాంగ్రెస్ సీఎం అయినప్పటికీ, తన రాజకీయ మూలాలు ఎన్టీఆర్ సిద్ధాంతాల్లోనే ఉన్నాయని, ఇప్పటికీ చంద్రబాబు పట్ల తనకు గౌరవం ఉందని పరోక్షంగా సంకేతాలిస్తున్నారు. చంద్రబాబును ఆయన ఎప్పుడూ వ్యక్తిగతంగా విమర్శించకపోవడం వెనుక ఉన్న అసలు కారణం ఇదే.తెలంగాణలో టీడీపీ క్యాడర్ ఇప్పటికీ రేవంత్ రెడ్డిని మనవాడే అని భావిస్తుంది. ఇప్పుడు మైత్రివనం వంటి అత్యంత రద్దీ ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా, అటు సెటిలర్లను, ఇటు టీడీపీ అభిమానులను రేవంత్ తన వైపు తిప్పుకున్నారు. మా పార్టీ నాయకుడు కాకపోయినా, మా దైవానికి గౌరవం ఇచ్చారు అనే భావనను టీడీపీ శ్రేణుల్లో కలిగించడంలో రేవంత్ నూటికి నూరు శాతం విజయం సాధించారు. ఎన్టీఆర్‌ను తెలుగు జాతి గర్వకారణంగా కీర్తిస్తూ, ఇటు తెలంగాణ వాదులను ఇబ్బంది పెట్టకుండానే అటు సెటిలర్ల మనసు గెలుచుకుంటున్నారు. దీనివల్ల గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వాడే సెంటిమెంట్ కార్డు ఇకపై పనిచేయదు. పైగా, ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ ఎక్కడ అని రేవంత్ ప్రశ్నించడం ద్వారా బీఆర్ఎస్ అధినేతను డిఫెన్స్‌లో పడేశారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు రేవంత్ రెడ్డికి అగ్నిపరీక్ష లాంటివి. నగరంలో కాంగ్రెస్ బలపడాలంటే టీడీపీ సానుభూతిపరుల మద్దతు అనివార్యం. అందుకే, ఆయన వ్యూహాత్మకంగా తన ప్రసంగాల్లో ఇందిరా గాంధీతో పాటు ఎన్టీఆర్ పేరును కూడా సమానంగా వాడుతున్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన పక్కా ఇళ్ల పథకమే.. ఈనాటి ఇందిరమ్మ ఇళ్లు అని చెప్పడం ద్వారా రెండు పార్టీల సిద్ధాంతాలను ఒకే తాటిపైకి తెచ్చారు. ఇది రాజకీయంగా రేవంత్ రెడ్డికి అడ్వాంటేజ్ ఇచ్చే అంశం. రాజకీయాల్లో ఏదీ యాదృచ్ఛికం కాదు. రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం వెనుక ఉన్నది కేవలం అభిమానం మాత్రమే కాదు, పక్కాగా లెక్కగట్టిన పొలిటికల్ అరిథ్మెటిక్. టీడీపీ ఓట్లను కాంగ్రెస్ వైపు తిప్పుకుంటే, గ్రేటర్ హైదరాబాద్‌లో తిరుగులేని శక్తిగా ఎదగవచ్చని ఆయన భావిస్తున్నారు. మరి రేవంత్ వేసిన ఈ విగ్రహా రాజకీయం ఓట్ల రూపంలో ఎంతవరకు మారుతుందో రాబోయే ఎన్నికలు తేల్చనున్నాయి.

వేకువ సమయం
మంగళవారం 02 జూన్ 2026



**వైవిధ్యమైన పాత్రలతో దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక ముద్రవేసిన స్టార్ హీరోయిన్ జ్యోతిక. తాజాగా బాలీవుడ్ చిత్రం 'సిస్టమ్'తో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ ప్రాజెక్ట్ ప్రమోషన్స్ సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన సినీ ప్రస్థానం, నార్త్-సౌత్ చిత్ర పరిశ్రమల మధ్య ఉన్న పని సంస్కృతి, మహిళా నటుల హక్కుల గురించి ఎంతో ధైర్యంగా మాట్లాడారు. నటిగా తన అంతరంగాన్ని ఆవిష్కరించిన ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...**

# సౌత్ నన్ను ఆదరించింది



నా మొదటి హిందీ సినిమా 'డోలీ సజాకే రఖ్నా' బాక్సాఫీసు వద్ద ఘోరంగా ఫ్లాప్ అయినప్పుడు.. బాలీవుడ్ ఇండస్ట్రీ నాకు ఒక్కసారిగా తలుపులు మూసేసింది. మొదటి సినిమాతోనే వైఫల్యాన్ని ఎదుర్కోవడం నన్ను తీవ్ర నిరాశకు గురిచేసింది. బాలీవుడ్ తిరస్కరించిన ఆ సమయంలో సౌత్ పరిశ్రమ నన్ను ఎంతగానో ఆదరించింది. నా మొదటి తమిళ సినిమా ఆశించిన విజయం సాధించకపోయినా అక్కడి మేకర్స్, ప్రేక్షకులు నా వైఫల్యాన్ని చూడలేదు.

## సొంతింటి అమ్మాయిలా గుర్తింపు

సౌత్ మేకర్స్ నాలోని నటిని, నా ప్రతిభను గుర్తించి వరుసగా ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఇచ్చారు. నిజం చెప్పాలంటే చెన్నై నగరం, అక్కడి ప్రేక్షకులు నేను ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువే ఇచ్చి నన్ను వారి సొంత ఇంటి అమ్మాయిలా గుండెల్లో పెట్టుకున్నారు. ఆ ఆదరణే నన్ను సౌత్‌లో దశాబ్దాలపాటు స్టార్ హీరోయిన్‌గా నిలబెట్టింది. ఆ తర్వాత వివాహం, పిల్లల బాధ్యతల వల్ల నేను సినిమాలకు చాలా కాలంపాటు లాంగ్ బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో కెమెరా ముందుకు వచ్చినప్పుడు నాలో తెలియని ఒక భయం, చేతుల్లో వణుకు మొదలయ్యాయి.

## సున్నా నుంచి సరికొత్త ప్రయాణం

గతంలో నాకు ఎంత అనుభవం ఉన్నా.. కెరీర్‌ను మళ్లీ మొదటి నుంచి, సున్నా నుంచి ప్రారంభిస్తున్నట్టు అనిపించింది. నటన మాత్రమే కాదు.. సుదీర్ఘ విరామం కారణంగా హిందీ భాషపై పట్టు కోల్పోవడంతో లాంగ్వేజ్ కూడా నాకు పెద్ద సవాలుగా మారింది. అయితే నా ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో బాలీవుడ్‌కు తిరిగి వచ్చాక ఇక్కడ గొప్ప సానుకూల మార్పును గమనించాను. ప్రస్తుతం హిందీ చిత్ర పరిశ్రమలో, ముఖ్యంగా డిజిటల్ యుగంలో ఓటీటీ రంగం విస్తరించిన తర్వాత 40 ఏళ్లు పైబడిన మహిళా నటుల కోసం ఎంతో వైవిధ్యమైన, సవాలుతో కూడిన పవర్‌ఫుల్ పాత్రలు రాస్తున్నారు.

## వయసు హద్దులు చెరిపేసే ఓటీటీ

ఒకప్పుడు హీరోయిన్లకు 30 ఏళ్లు దాటితే కెరీర్ ముగిసిపోయిందనే ముద్ర వేసేవారు. కానీ నేడు ఆ హద్దులు పూర్తిగా చెరిగిపోయాయి. మహిళా ప్రాధాన్యం ఉన్న వైవిధ్యమైన కథలు ఇక్కడ పుట్టుకొస్తున్నాయి. నిజాయతీగా చెప్పాలంటే ఈ విషయంలో సౌత్ ఇండస్ట్రీ ఇంకా ఎంతో మారాల్సి ఉంది. 40 ప్లస్ మహిళల కోణంలో కథలను అన్వేషించడంలో సౌత్ ఇంకా వెనుకబడే ఉంది. నార్త్, సౌత్ పరిశ్రమలు రెండింటిలోనూ ప్లస్‌లు, మైనస్‌లు ఉన్నాయి.

## పనిగంటల వివాదం

ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చకు దారితీసిన '8 గంటల పనివేళల' అంశంపై నా అభిప్రాయం చాలా స్పష్టం. దీపికా పదుకొణె తన సినిమాల్లో 8 గంటల షిఫ్ట్ అడగడంలో ఎలాంటి తప్పు లేదు. నిజానికి సౌత్ ఇండస్ట్రీలో నేను పనిచేసినప్పుడు ఇలాంటి డిమాండ్‌ను ప్రత్యేకంగా అడగాల్సిన అవసరమే ఎప్పుడూ రాలేదు. ఎందుకంటే అక్కడ 99 శాతం సినిమాల షూటింగ్స్ సాయంత్రం 6 గంటలకల్లా ప్యాకప్ అయిపోతాయి. ఉదయం 7 గంటలకో, లేదా 9 గంటలకో షూటింగ్ ప్రారంభించి సాయంత్రం కచ్చితంగా 6 గంటలకు ముగించడం అక్కడ దశాబ్దాలుగా పాటిస్తున్న ఒక ఆరోగ్యకరమైన అలవాటు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఉదయం నుంచి రాత్రి వరకు 12 గంటలపాటు విరామం లేకుండా సుదీర్ఘమైన షిఫ్ట్‌లు నడుస్తుంటాయి. ఇది శారీరకంగా, మానసికంగా ఎంతో అలసటను కలిగిస్తుంది. చిత్ర పరిశ్రమలో ఎంతోమంది స్టార్ హీరోలు 8 గంటల సమయం ముగియగానే.. ఆఖరికి షాట్ పూర్తయిందా లేదా అని కూడా చూడకుండా నేరుగా కారెక్కి వెళ్లిపోతుంటారు. వారిని ఎవరూ ప్రశ్నించరు. వారినెవరూ తప్పుబట్టరు.

## మాపైనే ఎందుకీ వివక్ష?

కెరీర్‌లో ఒక మంచి స్థానానికి చేరుకుని, ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఒక నటి తన పనిగంటల గురించి, పని-వ్యక్తిగత సమతుల్యత గురించి అడిగితే ఎందుకింత వివాదం చేయాలి? ఎందుకంత వివక్ష చూపాలి? ఒక వ్యక్తిగా, అంతకంటే ముఖ్యంగా ఒక తల్లిగా మహిళలకు ఇలాంటి సమయ పాలన ఎంతో అవసరం. మన సమాజంలో స్త్రీలు కెరీర్ మాత్రమే చూసుకుంటే సరిపోదు.

## పరస్పర సహకారంతోనే విజయం

సూర్య షూటింగ్స్‌లో బిజీగా ఉన్నప్పుడు నేను ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకుంటాను. నేను షూటింగ్‌ల కోసం ముంబై వచ్చినప్పుడు సూర్య పిల్లల బాధ్యత తీసుకుంటారు. ఈ పరస్పర సహకారం వల్లే మేము వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను విజయవంతంగా సమన్వయం చేసుకోగలు గుతున్నాం.

## ప్రేక్షకుల ముందుకు 'సిస్టమ్'

ఈ సరికొత్త ఆలోచనలు, మారుతున్న సినిమా ధోరణుల మధ్యే నా తాజా చిత్రం 'సిస్టమ్' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలైన ఈ సిరీస్ ఒక ఇంటెన్స్ కోర్ట్ రూమ్ డ్రామా. ఇందులో నేను సమాజంలో ఎలాంటి ఆర్థిక వనరులు, బ్యాక్ గౌండ్ లేని ఒక సాధారణ కోర్టు స్టెనోగ్రాఫర్ పాత్రను పోషించాను. సోనాక్షి సిన్హా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, ప్రముఖ దర్శకుడు అశుతోష్ గోవారికర్ డిఫెన్స్ లాయర్‌గా కీలక పాత్రలో నటించారు. ప్రసిద్ధ దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారీ ఈ చిత్రాన్ని అద్భుతంగా, ఎంతో సహజంగా తెరకెక్కించారు. ఒక దర్శకురాలి సెట్స్‌లో పనిచేయడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా సమాజంలో మహిళల వాణిని బలంగా వినిపించే ఇలాంటి కథలు, పాత్రలు మరిన్ని రావాల్సిన అవసరం ఉంది.

## దీపిక నిర్ణయం సరైనదే

షూటింగ్ ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత పిల్లలను చూసుకోవాల్సిన బాధ్యత, వారి చదువులు, ఎదుగుదలలో భాగం పంచుకోవాల్సిన అవసరం తల్లులకు ఉంటుంది. దీపిక ఇటీవల ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఒక తల్లిగా ఆ పాపను క్షేమంగా పెంచాల్సిన బాధ్యత ఇప్పుడు ఆమెపై ఉంది. కాబట్టి ఆమెకు 8 గంటల షిఫ్ట్ కచ్చితంగా అవసరం. ఒక తల్లిగా ఆమె దానికి పూర్తిగా అర్హురాలు. శ్రమ అనేది ఎప్పుడూ శరీరానికి, మనసుకు హాని కలిగించేలా ఉండకూడదు. పనికి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతుల్యత ఉన్నప్పుడే ఎవరైనా తమ వృత్తిలో ప్రతిభ కనబరచగలరు. నా వ్యక్తిగత జీవితంలో కూడా నా భర్త సూర్య, నేను ఇదే బ్యాలెన్స్ పాటిస్తాం. మా కుటుంబంలో ఒకరి నిర్ణయాలను, కెరీర్‌ను మరొకరం ఎంతో గౌరవించుకుంటాం.




ఆరోగ్య సమస్యలకు కచ్చితమైన, సమర్థమైన వైద్యం అందాలంటే, సదరు సమస్యలకు తగిన వైద్యులనే ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా మలద్వారంతో ముడిపడి ఉండే సమస్యలకు 'ప్రొక్టాలజిస్ట్'నే ఎంచుకోవాలి. సమస్య మూల కారణాన్ని గుర్తించి, దాన్ని కూకటివేర్లతో పెకిలించే సామర్థ్యం ఈ వైద్యులకు మాత్రమే ఉంటుందనీ, పైల్స్, ఫిషర్స్ మొదలైన రుగ్మతలకు మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయనీ ప్రముఖ ప్రొక్టాలజిస్ట్, డాక్టర్ శాంతివర్ధని వివరిస్తున్నారు

నోటి ద్వారా తింటాం, మలద్వారం ద్వారా విసర్జిస్తాం. తినడానికి నోరు ఎంత కీలకమో, విసర్జనకు మలద్వారం కూడా అంతే ముఖ్యం కాబట్టి నోరును ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మలద్వారాన్ని కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈ ప్రదేశం ఎంతో సున్నితమైనది, సంక్లిష్టమైనది. మల పరిమాణాన్ని బట్టి రబ్బరు బ్యాండులా సాగుతూ, మూసుకుపోతూ ఉండే అద్భుతమైన యంత్రాంగాన్ని కలిగిన మలద్వారం, ఎక్కువగా నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటుంది. దాంతో పైల్స్, ఫిషర్స్ లాంటి సమస్యలు వేధించడం మొదలుపెడతాయి. ఈ సమస్యల కారణాలు, పరిష్కారాల గురించి తెలుసుకుందాం!

## మొలలతో ముప్పు

శరీరంలో తయారయ్యే వ్యర్థం ఎప్పటికప్పుడు బయటకు వెళ్లిపోతూ ఉండాలి. అందుకే రోజంతా పేగుల్లో పేరుకుపోయిన వ్యర్థమంతా, ఉదయం నిద్ర లేవగానే కాలకృత్యాల రూపంలో బయటకొచ్చేస్తూ ఉంటుంది. అయితే ఈ విసర్జన ప్రక్రియ సహజసిద్ధంగా జరిగినప్పుడు, ఆ రోజంతా ఎలాంటి చీకూ చింతా లేకుండా గడిచిపోతుంది. ఇలా ఉదయాన్నే సుఖవిరోచనం జరగనప్పుడు ముక్కడం మొదలుపెడతారు. విరోచనమయ్యే సూచనలు లేకున్నా, ఎక్కువసేపు కూర్చుంచిపోతారు. దాంతో లోపలున్న పైల్స్, స్పాంజి బంతుల్లా నెమ్మదిగా బయటకు తోసుకురావడం మొదలుపెడతాయి. ఈ పరిస్థితిలో ప్రెజర్‌తో మలాన్ని విసర్జించే ప్రయత్నం చేసినప్పుడు, మొలలు పగిలిపోతాయి. దాంతో రక్తస్రావం మొదలవుతుంది. బయటకు ఉబ్బినట్టుండే మొలలున్న వాళ్లలో రక్తస్రావం కనిపించకపోవచ్చు. ఇలాంటి మొలల విషయంలో వాటి నుంచి రక్తం బయటకు కారకపోయినా, లోపలే గూడుకట్టుకుపోతుంది. అంతర్గత మొలలతో నొప్పి లేకపోయినా, రక్తస్రావం ఉంటుంది. కానీ బహిర్గత మొలలు రక్తస్రావం లేకపోయినా, నొప్పితో వేధిస్తాయి.

## చికిత్స కీలకం

బహిర్గత మొలలను మందులతో తగ్గించగలిగితే రోగికి ఉపశమనం కలుగుతుంది. కానీ రక్తస్రావం అవుతున్న అంతర్గత మొలలకు లేజర్‌తో, స్టాప్లర్‌తో లేదా ఇంజెక్షన్లతో చికిత్స చేయొచ్చు. అయితే పూర్వం మొలలను కత్తిరించి, కుట్టు వేసేవారు. ఇలా చేయడం వల్ల మలద్వారం వదులైపోయి, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటూ ఉండేది. దాంతో ప్రత్యామ్నాయంగా కొందరు నాటువైద్యులను ఆశ్రయిస్తూ ఉంటారు. మొలలను కత్తిరించకుండా, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోకుండా, మలద్వారం వదులవకుండా, మొలలను వాటి వాటి స్థానాలకు చేర్చే సమర్థమైన చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. 20% మేర మలవిసర్జన నియంత్రణ, మొలల మీదే ఆధారపడి ఉంటుంది. కాబట్టి వాటిని తొలగించని చికిత్సలను అందించే, సంబంధిత రంగంలో శిక్షణ పొందిన ప్రొక్టాలజిస్టులనే ఆశ్రయించాలి.

## ఫిషర్స్‌తో అసౌకర్యం

నోట్లో ఉండే మ్యూకోసా, మలద్వారం లోపల ఉండే మ్యూకోసా ఒకటే! కాబట్టి నాలుక, పెదవుల లోపల, బుగ్గల్లో పుండ్లు ఎంతగా బాధిస్తాయో, మలద్వారం లోపల తలెత్తే ఫిషర్స్ కూడా అంతే వేధిస్తాయి. ఈ సమస్య విపరీతంగా బాధిస్తుంది కాబట్టి మలవిసర్జనే మానేస్తూ ఉంటారు. దాంతో మలబద్ధకం పెరిగి, ముక్కడం మొదలుపెడతారు. దాంతో మ్యూకోజా చీరుకుపోయి, మంట, నొప్పి వేధిస్తాయి. ఆ సమయంలో కొందరు, నొప్పి తగ్గించే మందులు, సుఖవిరోచన మందులు వాడుకుంటూ తాత్సారం చేస్తూ ఉంటారు. ఫలితంగా అది మానని పుండులా మారిపోయి, దాన్లో మలం పేరుకుపోతూ, ఆ ప్రదేశం మరింత కుళ్లిపోయి సమస్య మరింత జటిలమవుతుంది. సుదీర్ఘ ప్రయాణాలు చేసినప్పుడు, ఆ ప్రదేశంలో ఎక్కువ చమట పట్టినప్పుడు, మధుమేహం బారిన పడ్డప్పుడు... ఆ ఫిషర్ మరింత లోపలకు తొలుచుకుంటూ వెళ్లిపోయి, మలద్వారం పరిసరాల్లో పుండులా, గడ్డలా బహిర్గతమవడం మొదలుపెడుతుంది.

## ఫిస్టులా బాధలు

మల ద్వారం దగ్గర తలెత్తే సెగ్గడ్డలను పోలిన సమస్య ఇది. వీటిని చూసి, వేడి చేసి సెగ్గడ్డ వచ్చిందని అనుకుంటూ ఉంటారు. వీటికి కొందరు గవద పట్టీలు అంటిస్తే, ఇంకొందరు వేడి కాపడం పెట్టడం, స్వయంగా యాంటీబయాటిక్స్ కొని వాడేయడం చేస్తూ ఉంటారు. కానీ మలద్వారం పరిసరాల్లో ఎలాంటి పుండు, సెగ్గడ్డ వచ్చినా, దాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రారంభంలో గడ్డ లేదా పుండులా కనిపించినా, ఆ తర్వాత దానికి రంధ్రం ఏర్పడి చీము కారడం మొదలుపెడుతుంది. అయితే ఈ ఫిస్టులా వేరు, మల ద్వారం లోపల ఉంటే, దాని కొమ్మలు మలద్వారం పరిసరాల్లో పుండ్ల రూపంలో బయటకు కనిపిస్తాయి. ఈ సమస్యను సమూలంగా నిర్మూలించడం కోసం, కొమ్మలను కత్తిరించడానికి బదులుగా, వేరును పెకిలించాల్సి ఉంటుంది. ఫిస్టులా చికిత్సలో ఏ చిన్న పొరపాటు జరిగినా, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఫిస్టులా తిరగబెట్టినా ఫర్వాలేదు. దాన్ని చికిత్సతో సరిచేసుకోవచ్చు. కానీ స్ఫింక్టర్లు దెబ్బతిని మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోతే, ఆ సమస్యను సరిదిద్దడం కష్టం. కాబట్టి ఫిస్టులా చికిత్సలో భాగంగా మలవిసర్జన నియంత్రణకు తోడ్పడే స్ఫింక్టర్లను చెక్కుచెదరనివ్వని ప్రొక్టాలజిస్టులనే ఆశ్రయించాలి.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు





## హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

మొదటి పేజీ తరువాయి

**సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల జిల్లా :** జూరాల ప్రాజెక్టు, గుడ్డేందొడ్డి రిజర్వాయర్, తదితర పరిశీలించడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 4న సీఎం రేవంత్ రెడ్డి ధరూరు మండలంలోని జూరాల ప్రాజెక్టు, గుడ్డేందొడ్డి రిజర్వాయర్, తదితర పరిశీలించడానికి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, వనపర్తి ఎస్పీ సునీత రెడ్డితో కలిసి ప్రాజెక్టు తదితర పరిసర ప్రాంతాల్లో హెలిపాడ్ నిర్మాణం, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. జూరాల ప్రాజెక్టు సమీపంలోని రేవులపల్లి గ్రామం జెన్కో క్వార్టర్స్ లో, రామాలయం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో, తదితర ప్రాంతాల్లో హెలిపాడ్ ఏర్పాటు చేసేందుకు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెలిపాడ్ నుంచి ఆయా ప్రాజెక్టను సందర్శించే దారిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. రెండు రోజులే సమయం ఉండడంతో సీఎం పర్యటించే కాన్వాయ్ రహదారులను మరమ్మత్తు చేయించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ఉంటే సరి చేయించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన చోట బారికేడ్లతో పాటు ఇతర ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, డిఎస్పి మొగిలయ్య, ఇరిగేషన్ ఈఈ సంజీవ్ ప్రసాద్, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులున్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి





**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి సమయం ప్రతినిధి:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధి కారులకు సూచనలు ఇస్తూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కరించి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చి పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 59 దరఖాస్తులు వచ్చాయి.కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పరుగులు పెడుతున్న పోలవరం పనులు

ఏలూరు : పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న బహుళార్థక ప్రాజెక్టుగా గుర్తించబడుతోంది. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ఈ ప్రాజెక్ట్ వివిధ దశల్లో కొనసాగుతూ వస్తోంది. ప్రతిపాదన స్థాయి నుంచి పూర్తిస్థాయి నిర్మాణం వరకు ఇంత భారీ సమయం తీసుకున్న ప్రాజెక్ట్ దేశంలో చాలా అరుదు. అయినప్పటికీ ఇది రాష్ట్ర అభివృద్ధికి జీవనాడిగా భావించబడుతోంది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 2024 నుంచి ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుని వేగంగా పనులు కొనసాగిస్తోంది. ఈ లక్ష్యంతో వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ప్రాజెక్ట్‌లో కీలకమైన భాగమైన ఎడమ కాలువ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. గోదావరి నది (జలాలను ఉత్తరాంధ్ర ప్రాంతానికి తరలించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. ముఖ్యంగా అనకాపల్లి , విశాఖపట్నం ( ప్రాంతాలకు నీటి సరఫరా అందించేందుకు ఈ కాలువ కీలక పాత్ర పోషించనుంది.ఎడమ కాలువలో నేషనల్ హైవేలు క్రాసింగ్ వద్ద బ్రిడ్జ్ నిర్మాణాలు, ఇతర ఇంజినీరింగ్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.ప్రణాళిక ప్రకారం మరో కొన్ని నెలల్లో ఎడమ కాలువ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత గోదావరి జలాలను అనకాపల్లి వరకు తరలించే ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నారు. ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కాలువను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఈ పనుల్లో ఆలస్యం జరగకుండా ఉండేందుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

# విబిజి రాంజీ చట్టం రద్దుకై పోరాడుదాం



**(సమయం ప్రతినిధి కొత్తకోట) :** వీబిజిరామ్ జి చట్టం రద్దుకై పోరాడుదామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు మండ్ల సత్య నారాయణ . పిలుపునిచ్చారు ఆయన సోమవారంనాడు అజ్జకొల్లు ఉపాధి కూలీలతో మాట్లాడుతూ. ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు గత రెండు నెలలుగా కూలీపని చేసినడబ్బులు రాకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతిరోజు ఉపాధి పని ప్రదేశంలో రెండు పూటల ఫోటో క్యాప్చర్ తీసే విధానంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు అడవులలో పనులు జరగడం వల్ల నెట్వర్క్ రాకపోవడంతో కూలీలు ఎంతో దూరం నుంచి వచ్చిన ఫోటోకాప్చర్ రాకపోవడంతో వెనుతిరిగి ఆరోజుపూర్తిగా పని కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని. నెట్వర్కు రానిప్రదేశంలో ఆఫ్లైన్ అటెండెన్స్ కు అవకాశం ఇవ్వాలనికోరారు పని ప్రదేశంలో మంచినీటి వసతి ప్రతిరోజు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ. తట్ట బుట్ట ఫస్ట్ ఎయిడ్ బాక్స్ పారలు. టెంట్లు సరపరచేయాలనీ కోరారు కొలతల పద్ధతిని రద్దుచేసి రోజు కూలి600 ఇవ్వాలని ఏడాదికి 200 ఉపాధి పని దినాలను కల్పించాలని మహాత్మా గాంధీ జాతీయ పథకం స్థానంలో కొత్తగా తెచ్చిన నరేగా స్కీంను రద్దుచేసి పాత పద్ధతిలోనే కేంద్రం 90 శాతం. రాష్ట్రం 10% నిధులను భరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి సిబ్బంది 2నెలల వేతనబకాయిలు ఇవ్వాలని. ఫీల్డ్ అసిస్టెంట్ లకు 26000కనీసవేతనం అమలు చేయాలనీ డీమాండ్ చెశారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా భూమి లేని.పె దలకు ఏడాదికి యిచ్చే 12000.కు నిధులు ఇవ్వాలని కోరారు .పని ప్రదేశంలో టెంట్లు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలనీ కోరారు . ఈ కార్యక్రమం లో.రమాదేవి. తిరుపతమ్మ. లక్ష్మి. రాజు మన్యమ్మ.తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి







**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, సమయం ప్రతినిధి:** జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, సక్రమంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ ప్రాంగణంలో వేడుకలు నిర్వహించే ప్రాంగణం, జెండా ఆవిష్కరణ స్థలం, పోలీస్ గౌరవ వందనం ఏర్పాట్లు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు సలహాలు చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, సక్రమంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ భాను ప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమయం
మంగళవారం 02 జూన్ 2026

# విద్యార్థుల సంక్షేమానికి మరో అడుగు

# పేద విద్యార్థుల కోసం ఎంపీ మల్లు రవి ప్రత్యేక చొరవ





**నాగర్ కర్నూల్ ప్రతినిధి :** గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి రవాణా సమస్యల పరిష్కారానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ప్రత్యేక చొరవతో సోమవారం నాగర్‌కర్నూల్ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో 80 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సౌజన్యంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 74 మంది విద్యార్థులతో పాటు నార్లాపూర్ పాఠశాలకు చెందిన 6 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, డీఈఓ రమేష్ కుమార్‌లతో కలిసి ఎంపీ మల్లు రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ... తన విద్యార్థి దశలో పేదరికం కారణంగా ప్రతిరోజూ ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లిన రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులు అలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో రవాణా ఒకటని, సైకిళ్లు అందించడం ద్వారా వారు సమయానికి పాఠశాలకు చేరుకోవడంతో పాటు విద్యపై మరింత ఆసక్తి పెంపొందించుకుంటారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని, ఇందుకు కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు త్వరలో షూల పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ...... అభివృద్ధి చెందిన దేశాల్లో సైకిళ్ల వినియోగం అధికంగా ఉంటుందని, ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంతో పాటు సమయపాలన అలవడుతుందని అన్నారు. విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించడంలో సైకిళ్లు కీలక పాత్ర పోషిస్తాయని, తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 24 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే,1000 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని ఎమ్మెల్యే కోరారు.

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ విద్యార్థుల చదువుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, సైకిళ్ల ద్వారా వారు సులభంగా పాఠశాలకు చేరుకుని విద్యాభ్యాసాన్ని అంతరాయం లేకుండా కొనసాగించగలరని అన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎంపీ మల్లు రవి, జిందాల్ స్టీల్ పవర్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సైకిళ్లు తమ విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడతాయని, మరింత కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధిస్తామని విద్యార్థులు హైమావతి ఐశ్వర్య, సాదిక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రమేష్ కుమార్, కౌన్సిలర్ చంద్రకళ, జిందాల్ సంస్థ ప్రతినిధి రెడ్డి నాయక్, జిల్లా విద్యా శాఖ అధికారులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు శెట్టి, ప్రధానోపాధ్యాయులు రాంజీ, మధుసూదన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవితో చేయాలని ఉంది

హైదరాబాద్ : రాజకీయంగా మాజీమంత్రి రోజా దూకుడు స్వభావంతో ఉంటారు. రాజకీయ ప్రత్యర్థులను విపరీతంగా ద్వేషిస్తుంటారు. ముఖ్యంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై ఆమె వాడే భాష, పదప్రయోగం తీవ్రంగా ఉంటుంది. ఇటీవల మెగా ఫ్యామిలీ పై కూడా ఆమె తరచూ వ్యాఖ్యానాలు చేస్తుంటారు. వారికి మద్దతుగా నిలిచే బుల్లితెర నటులపై కూడా నోరు పారేసుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే రాజకీయంగా విభేదించే రోజా సినిమాల పరంగా మాత్రం మెగా ఫ్యామిలీ వైపు మొగ్గు చూపుతుండడం విశేషం. మెగా ఫ్యామిలీతోనే తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ఆమె నోటి నుంచి వస్తోంది. చిరంజీవి అవకాశం ఇస్తే సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తానని ఆమె చెప్పుకు రావడం విశేషం. ప్రముఖ జర్నలిస్టు జాఫర్ హోస్ట్ గా వ్యవహరిస్తున్న బుల్లితెర కార్యక్రమానికి వచ్చారు మాజీ మంత్రి రోజా. ఆయన పలు ప్రశ్నలు వేశారు. సినిమా రంగంలో ఉన్న ఆ నలుగురు అగ్ర కథానాయకులు ఎవరితో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తారని ప్రశ్నించారు. మారు మాట చెప్పకుండా మెగాస్టార్ చిరంజీవి అంటూ తేల్చి చెప్పారు రోజా. ఆయనతో అయితే డాన్స్ పోటీపడి చేయవచ్చని చెప్పుకొచ్చారు. బాలకృష్ణ అంటే వ్యక్తిగతంగా ఇష్టం కానీ.. చిరంజీవితో నటించడం అంటేనే తనకు ఆసక్తి అని నిర్మొహమాటంగా చెప్పేశారు. నాగార్జునకు తాను అభిమానిని.. ఆయనతో నటించిన అని చెప్పారు. వెంకటేష్ తో ఒకే ఒక్క సినిమా మాత్రమే చేశానని.. ఆయన విషయంలో సైతం ఆప్షన్ లేదని తేల్చి చెప్పారు రోజా. వాస్తవానికి మెగాస్టార్ చిరంజీవితో రోజాకు మంచి అనుబంధమే ఉండేది. ఆయనతో కలిసి పలు హిట్ చిత్రాల్లో నటించారు. మంత్రిగా ఎంపికైన తర్వాత చిరంజీవి ఆశీర్వాదం కూడా తీసుకున్నారు.. మరో మెగా బ్రదర్ నాగబాబుతో సుదీర్ఘకాలం ఈటీవీ జబర్దస్త్ కార్యక్రమంలో జడ్జిగా కొనసాగారు. అయితే పవన్ కళ్యాణ్ పార్టీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ పెట్టుకుంటూ వస్తున్నారు. మధ్య మధ్యలో మెగా ఫ్యామిలీ పై సైతం అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి.







OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085